# ప్రజాశక్తి

శనివారం 25 నవంబర్ 2023 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల



భూమిని కోల్పోయిన బాధితులు

కొంప ముంచుతున్న..

# ‘జగనన్న భూ రక్షణ’

- రీ సర్వేలో భూములు కోల్పోతున్న సాగుదారులు
- ఆందోళనలో బాధితులు

**ప్రజాశక్తి-మార్కాపురం**

‘కొండ నాలుకకు మందు వేస్తే... ఉన్న నాలుక ఊడిందట’ అనే చందంగా ‘జగనన్న భూ రక్షణ పథకం’ ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జగనన్న భూ హక్కు, భూ రక్షణ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే చేపట్టారు. సర్వే ఉద్దేశ్యం మంచిదే అయినా... క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది లోపభూయిష్టంతో సాగుదారులకు అన్యాయం జరుగుతోంది. పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన సాగు భూములను సైతం సర్వేలో కొందరు కోల్పోతున్నారు. భూములు కోల్పోతున్న వారిలో మధ్య తరగతి వారే అధికంగా ఉండటం గమనార్హం.

తరుపాడు మండలంలో కందల్లపల్లెలో రీ సర్వేలో 20 కుటుంబాల వారు భూములు కోల్పోయ్యారు. తమ తాత, ముత్తాల కాలం నుంచి వారు ఆ భూముల్లో ఉన్నారు. రీ సర్వే అనంతరం వారి పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. ఆ భూములకు గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకాలతో బ్యాంకుల్లో రుణాలు ▶ 2లో

పేర్నమిట్టలో రైతుల భూమిని

# కబ్జా చేసిన వైసిపి మహిళా నేత

- 1979 నుంచి నలుగురు రైతుల సాగులో ఉన్న భూమికి ఎసరు
- తమ తాతకు పట్టా ఇచ్చారంటూ ఐదునెలలక్రితం ఆక్రమించిన వైనం
- సిట్‌ను ఆశ్రయించిన బాధితులు..
- ఎటూ తేల్చని రెవెన్యూ అధికారులు
- పాలకపక్ష నేతగా పోలీసుల సాయంతో పనులు అడ్డగింత



పోలీసు స్టేషన్‌కు తరలించిన రైతుల ట్రాక్టర్

**ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో**

పాలకపక్ష నేతల భూదందాలు ఆగడంలేదు. నకిలీ పత్రాలను అడ్డుపెట్టుకుని కుంభకోణాలకు పాల్పడుతున్నారు. మాజీ మంత్రి బాలినేని హెచ్చరికలను కూడా ఖాతరు చేయడం లేదు. తాజాగా పేర్నమిట్లలో రైతులు సాగుచేసుకుంటున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమికి ఓ వైసిపి మహిళానేత ఎసరు పెట్టారు. 1979లో నలుగురికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. అప్పటి నుంచి వారు సాగు చేసుకుంటున్నారు. ఇపుడు ఆ భూమి తమ తాతకు ఇచ్చారంటూ.. ఆయన్నుంచి తనకు వచ్చిందంటూ ఐదు నెలల క్రితం వైసిపి మహిళా నేత పురిణి ప్రభావతి కబ్జాచేశారు. ఆ భూమి తనదంటూ రైతులను బెదిరించి భూమిని ఆక్రమించే యత్నం చేయగా బాధిత రైతులు అడ్డుకున్నారు. పోలీసులను ఆశ్రయించారు. ఆక్రమించింది పాలకపక్ష నేత కావడంతో పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ భూమిలో రైతులు పశుగ్రాసం కోసం జొన్న వేశారు. శుక్రవారం తమ పొలంలోని జొన్నను రైతులు కోస్తుండగా పురిణి ప్రభావతి వెళ్లి వారిపై దౌర్జన్యం చేశారు. ట్రాక్టర్‌ను, రైతులను పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకునేలా చేశారు. బాధితులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పోలీసులు వారిని వదిలిపెట్టారు.

**1979లో రైతులకు ప్రభుత్వం పట్టాలు**

కబ్జాకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... పేర్నమిట్ట పరిధిలోని సర్వే నెంబరు 190లో 1979లో పాపని వెంకటసుబ్బయ్య, మాదాసుకోటయ్య, మాదాసు రత్తయ్య, ఆకుల వెంకటేశ్వర్లు అనే పేద రైతులకు ప్రభుత్వం 2.50 ఎకరాలకు పట్టాలు ఇచ్చింది. అప్పట్లో వీరికి పొజిషన్ సర్టిఫికెట్లను కూడా జారీచేసింది. ఇవి వారివద్ద ఉన్నాయి. అప్పటి నుంచీ ఆ భూమిని ఆ నలుగురు ▶ 2లో

# రెవెన్యూ అధికారికి ఫారం7 సెగ

- ఓటరు జాబితా తయారీలో అవకతవకలు
- తహశీల్దారు సురేష్ బాబుపై సస్పెన్షన్ వేటు



సస్పెండ్‌కు గురైన తహశీల్దారు

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

పర్చూరు నియోజకవర్గంలో ఫారం 7 సెగకు మరో రెవెన్యూ అధికారి బలయ్యాడు. గతంలో మార్టూరు తహశీల్దారుగా, ప్రస్తుతం చుండూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న బి. సురేష్ బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పర్చూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించాలని కోరుతూ 14 వేలకు పైగా ఫారం 7దరఖాస్తులు దాఖలయ్యాయి. పర్చూరు నియోజకవర్గంలో టిడిపి చెందిన వారి దొంగ ఓట్లు 40 వేల వరరకూ ఉన్నాయని, ఆ ఓట్లతోనే పర్చూరులో టిడిపి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు విజయం సాధిస్తున్నారని వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసిపి చెందిన వారు ఒకోక్కరు 20 నుంచి 200 పైగా ఫారం 7 ధరఖాస్తులు ఆన్‌లైన్‌లో దాఖలు చేశారు. మొత్తం 14 వేల ఓట్లను తొలగించాలని ఫారం 7 ద్వారా దరఖాస్తు చేశారు. అధికారం తమదేనని, అధికారులు తమ వారేనన్న భావనతో ఓట్లను తొలగించవచ్చునని దరఖాస్తులు దాఖలు చేశారు. రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో బిఎల్ఒలు, ఇతర అధికారులతో రాజకీయ నేతలు సమావేశాలు నిర్వహించారు. ఫారం 7 దరఖాస్తుల విషయంలో ఓట్ల తొలగించాలని దిశానిర్ధేశం చేశారు. కొందరు పోలీస్ అధికారులు సైతం నిబంధనలకు విరుద్ధంగా ఫారం 7 దరఖాస్తుల సమాచారాన్ని తీసుకున్నారు. ఓట్ల తొలగింపు కోసం బిఎల్ఒలపై ఒత్తిడి చేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. దొంగ ఓట్ల పేరుతో పర్చూరు నియోజకవర్గంలో జరుగుతున్న అధికారపార్టీ నేతల ఆగడాల గురించి స్థానిక ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. హైకోర్టులో ఫిటీషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా తయారీలో నిబంధనలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని ఎన్నికల అధికారులను హెచ్చరించారు. అయినప్పటికీ కొందరు పోలీస్, రెవెన్యూ అధికారులు రాజకీయ ఒత్తిడులతో ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. బిఎల్ఒలతో పోలీస్ అధికారులు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశాయించారు. ఫారం7 ద్వారా దాఖలైన దరఖాస్తులు విషయమై నేరుగా జోక్యం చేసుకున్నారు. గ్రామాల్లో వైసిపి చెందిన వారు ఫారం 7 ధరఖాస్తులు చేయడం, ఆ దరఖాస్తులపై బిఎల్ఒలు తీసుకోవాల్సిన చర్యల గురించి సిఐ,ఎస్ఐలు బూత్ లెవల్ ఆఫీసర్లకు వాట్సప్‌లో ఆదేశాలు ఇచ్చినట్లు తేలింది. దీంతో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మార్టూరు సిఐ ఫిరోజ్, ఎస్ఐలు ▶ 2లో

# బాలినేనికి సవాలుగా ఇళ్ల స్థలాల పంపిణీ

- స్థలాలు ఇచ్చాకే పోటీచేస్తానంటూ అల్టిమేటం
- నిధులు కోసం ఇప్పటికే పలుసార్లు సిఎంకు అభ్యర్థన



**ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో**

ఒంగోలులో పాతికవేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చాకే ఎన్నికల్లో పోటీచేస్తానంటూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పదేపదే స్పష్టం చేస్తున్నారు. ఇళ్ల స్థలాల వ్యవహారం రెండేళ్లుగా నలుగుతోంది. ఎన్నికల్లోపు ఆయన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వగలరా? అందుకు సిఎం జగన్ నిధులు ఇస్తారా? లేక వెలిగొండ ప్రాజెక్టు మాదిరిగానే వాయిదా వేస్తారా? అన్నది ఇపుడు తేలాల్సిఉంది. వెలిగొండ ప్రాజెక్టు అక్టోబరులో ప్రారంభించాకే ఎన్నికలకు పోతామని సిఎం జగన్ చెప్పారు. అదెలాగుందో చూశాం. ఆ హామీ ఎండమావిగానే మిగిలింది. ఇపుడు బాలినేని హామీపై చర్చ సాగుతోంది. సిఎం జగన్ చేతిలో ఇపుడు బాలినేని రాజకీయ భవితవ్యం ఉంది. ఎందుకంటే ఇళ్ల స్థలాలు ఇచ్చాకే ఎన్నికల్లో పోటీచేస్తామని ప్రకటించారు బాలినేని. ఇది పరోక్షంగా అధి ష్టానానికి కూడా సవాలు విసిరినట్లే. ఇపుడు నిధులు విడుదల చేయాలి. భూములు సేకరించిన రైతులకు చెల్లింపులు జరగాలి. అపుడు వాటిని ప్లాట్లుగా వేసి లబ్ధిదారులకు కేటాయించాలి. ఈ ప్రక్రియ వేగంగానే జరగాల్సి ఉంది. గతంలో యురజర్ల వద్ద పాతికోట్లు వరకూ ఖర్చుపెట్టి కొండను చదును చేశారు. తీరా స్థలాలు ఇచ్చే సమయానికి అది మైనింగ్ భూమి కావడంతో కోర్టు వివాదంలోకి చేరింది. రాజకీయంగానూ దుమారం రేగింది. అయితే అక్కడ స్థలాల పంపిణీ సాధ్యం కాదని తేలింది. దీంతో ప్రత్యామ్నాయాలు ఆలోచించిన బాలినేని రైతుల నుంచి భూములను సేకరించారు. వీటికోసం రూ.300 కోట్లకుపైగానే ఖర్చువుతోంది. ఇప్పటికే కొంత చెల్లించారు. ఇంకా రూ.150 కోట్లకుపైగానే చెల్లింపులు జరగాల్సి ఉంది.రైతులకు డబ్బులు ▶ 2లో

## పేర్నమిట్టలో రైతుల భూమిని కబ్జా చేసిన వైసిపి మహిళా నేత

(మొదటిపేజీ తరువాయి)

రైతులు సాగుచేసుకుంటున్నారు.ఇది ఊరందరికీ తెలిసినవిషయే. ఈ భూమిలో వచ్చే పంటతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల రియల్‌ఎస్టేట్ వ్యాపారం విస్తరించాక ఆ భూములకు ధరలు పెరిగాయి. ఇంకేముందీ అక్రమార్కులకు కన్నుపడింది. తాజాగా నకిలీపత్రాలు బాగా కలిసి వచ్చాయి.

**తమ తాత భూమి అంటూ జులుం**

ఈ భూమిని తమ తాతకు 1980లో పట్టా ఇచ్చారంటూ వైసిపి మహిళా నేత పురిణి ప్రభావతి ఓ నకిలీపాస్‌పుస్తకం సృష్టించారని బాధితులు చెబుతున్నారు. ఐదు నెలల క్రితం దాన్ని తీసుకొచ్చి భూమిచుట్టూ కంచె వేసేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. వాస్తవానికి ఈమెకు పేర్నమిట్టకు ఎలాంటి సంబంధం లేదంటున్నారు. నకిలీపత్రంతో తమ భూమిని కబ్జాచేస్తుందని అప్పడే రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయపరమైన వత్తిళ్లతో పోలీసులను ప్రభావితం చేశారు. కేసు నమోదు కాకుండా చూశారు. అప్పటి నుంచి ఈమెకూ, రైతులకు మధ్య వివాదం నడుస్తోంది.

**పంట కోస్తుండగా అడ్డగింత..**

ఎప్పటిలాగే రైతులు ఈఏడాది కూడా వర్షాలు కురవగానే జొన్నలు చల్లారు. ఇపుడు దాన్ని కోస్తుండగా వైసిపి మహిళానేత పురిణి ప్రభావతి ఆ పొలంలోకి వెళ్లి రైతులపై జులుం ప్రదర్శించారు. ఈ భూమిలోకి ఎలా వస్తారంటూ తమపై దౌర్జన్యం చేసినట్లు బాధిత బాధితులు వాపోయారు. పోలీసులకు చెప్పడంతో పాలకపక్షనేత కావడంతో వెనుకా ముందూ చూడకుండా ఆమెకే సహ కరించారు. రైతుల ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. రైతులు గట్టిగా నిలదీయడంతో వదిలేశారు.

**ఎస్‌పికి బాధితుల ఫిర్యాదు.. సిట్‌కు పంపిన ఎస్‌పి**

తమ భూమిని కబ్జా చేసేందుకు వైసిపి మహిళా నేత పురిణి ప్రభావతి ప్రయత్నిస్తున్నారని బాధిత రైతులు ఎస్‌పి మల్లికాగర్గ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారణ కోసం ఎస్‌పి తాలూకా పోలీసులకు పంపారు.సిట్ ద్వారా విచారణ చేయాలని ఆదేశించారు. పత్రాలను పరిశీలించి భూమి ఎవరిదో తేల్చాలని సంతనూతలపాడు తహశీల్దారు పంపారు. అక్కడ ఏమీ తేల్చకుండా నాన్చుతున్నారని బాధితులు చెబుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే భూ వివాదంపై అధికారులు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది.

**తక్షణం రైతులకు అప్పగించాలి: సిపిఎం నగర కార్యదర్శి రమేష్**

1979 నుంచి సాగుచేసుకుంటున్న రైతుల భూములను వైసిపి మహిళా నేత ఆక్రమించేయత్నం చేస్తుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ ఆరోపించారు. తక్షణమే ఆ భూములను రైతులు సాగుచేసుకొనేలా చర్యలు తీసు కోవాలని కోరారు. భూ కబ్జాకు పాల్పడిన వైసిపి మహిళా నేతపై చర్యలు తీసు కోవాలన్నారు. మాజీ మంత్రి బాలినేని అను చరులమంటూ రైతులను బెదిరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. సిట్ అధికారులు ఈ ఘటనపై విచారించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## బాలినేని సవాలుగా ఇళ్ల స్థలాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకుండా భూములు తీసుకుని పేదలకు ఇచ్చే పరిస్థితి లేదు. ఇపుడు నిధులే కీలకం. నిధుల కోసం ఇప్పటికే బాలినేని పలుసార్లు సిఎం జగన్‌ను కలిశారు. పట్టాలు ఇవ్వకపోతే ఇబ్బంది కలుగుతుందని సిఎంకు వివరించారు. సానుకూలంగానే స్పందిం చారని బాలినేని సిఎంను కలిసి బయటకు వచ్చినపుడల్లా చెబుతూనే ఉన్నారు. అయితే నిధులు మాత్రం రావడంలేదు. మార్చిలో ఎన్నికల షెడ్యూల్ రానుంది. సమయం కూడా తక్కువగానే ఉంది.జనవరి రాగానే అధి కారులు కూడా ఎన్నికల విధుల్లోకి వెళ్లిపోతారు. ఈలోపే నిధులు రావాలి. పేదలకు స్థలాలు ఇవ్వాల్సి ఉంది.ఏదేమైనా ఇపుడు బాలినేని పోటీ అనేది ఆయన చెప్పినట్లుగా ఇళ్ల స్థలాల పంపిణిపైనే ఆధారపడిందా? లేక సాధారణంగా ప్రకటించారా ? అనేది చర్చగా మారింది. వెలుగొండపై సిఎం జగన్ ఇచ్చిన హామీనే నెరవేరనపుడు ఇక్కడ బాలినేని హామీ, హెచ్చరికను సిఎం జగన్ అంత సీరియస్‌గా తీసుకుంటారా? లేదా?అనేదీ చూడాలి.

# భూ దందాలపై.. బహిరంగ చర్చకు సిద్ధమా?

### ప్రెస్‌మీట్‌లో టిడిపి నేత కందుల రామిరెడ్డి



మాట్లాడుతున్న టిడిపి నేత కందుల రామిరెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురం నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా జరిగిన భూ దందాలు, అక్రమాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, మీరు సిద్ధమేనా అని మాజీ వైసిపి నేతలకు టిడిపి నేత, మాజీ జడ్‌పిటిసి కందుల రామిరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామిరెడ్డి మాట్లాడారు. వైపిపి నేతలు తమ కుటుంబంపై లేని పోని ఆరోపణలు చేయడం, కొన్ని పత్రికల్లో తప్పుడు కథనాలు ప్రచురించడంపై ఆయన మండిపడ్డారు. మార్కాపురం పట్టణంలో తమ సొంత భూమి మూడు ఎకరాలను పేదల గహాలకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. మార్కాపురం మండలంలోని బోడపాడు ఇలాఖాలో సర్వే నెం 1119లో సుమారు 20 ఎకరాల పొలం తమకు ఊహ తెలిసినప్పటి నుంచి తమ పెద్దలు కందుల మల్లారెడ్డి ఒంటేరు పెద్దవెంకటయ్య, ఒంటేరు చిన్నవెంకటయ్య వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. తమ తండ్రి నారాయణరెడ్డి, తమ పెద్దమ్మ సాలమ్మలకు ఆ ఆస్తి సంక్రమించిందన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో భూ బకాసురులుగా ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి పేరు మోగుతోందన్నారు. పట్టా భూములు, పోరంబోకు భూములు, వాగు పోరంబోకు భూములు, వైశ్య సామాజిక వర్గాలకు చెందిన భూములు ఆక్రమించినట్లు ఆరోపించారు. భూ ఆక్రమణలపై మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో చర్చకు సిద్ధమేనా అని సవాల్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

## మహాపడావ్‌ను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి-టంగుటూరు:** ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న మహా పడావ్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి. కొండారెడ్డి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఐ.రాఘవమ్మ కోరారు. కొండపి నియోజకవర్గ శ్రామిక మహిళా అవగాహన తరగతులు టంగుటూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళల సమస్యలు, ప్రభుత్వ విధానాలు, పరిష్కార మార్గాలు, సంఘం నిర్మాణం తదితర అంశాల గురించి చర్చించారు. శ్రామిక మహిళా సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో తలపెట్టిన మహా పడావ్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ వేశపోగు మోజెస్, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా నాయకులు టంగుటూరి రాము, సిపిఎం కొండపి నియోజకవర్గ కార్యదర్శి కెజి. మస్తాన్, నాయకులు గడ్డం వందనం, కె. శ్రీనివాసులు, పి.అరుణ, కె.సుభాషిణి, సుకన్య, నాగమణి పాల్గొన్నారు.

# భూ దందాలపై చర్చకు సిద్ధమే!

### టిడిపి నేతల సవాల్‌ను స్వీకరిస్తున్నా.. ప్రెస్‌మీట్‌లో కృష్ణమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న కృష్ణమోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి-మార్కాపురం**

భూ దందాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు, టిడిపి నేత కందుల రామిరెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. దళితుల భూమి మీకు అనువంశికంగా ఎలా వస్తుందో చెప్పగలరా అని టిడిపి నేతలను ప్రశ్నించారు. మార్కాపురం నియోజకవర్గంలో భూ దందాలపై శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో పాత్రికేయు ల సమక్షంలో టిడిపి నేతలతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నా మని తెలిపారు. టిడిపి నేతల సవాల్‌కు కట్టుబడి ఉండాలని, చర్చ ఎప్పుడో తేదీని ప్రకటించాలని కృష్ణమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 1119 దళితుల భూమి అని, ఆ భూమి కందుల నారాయణరెడ్డి కుటుంబ సభ్యులపై అనువంశికంగా ఎలా వస్తుం దో స్పష్టంగా చెప్పాలని కోరారు. రికార్డుల్లో అనువంశికంగా పేర్కొన్నారని, దళితుల పొలం ఎలా అనువంశికంగా వస్తుందో ఇప్పటికీ అర్థం కావడంలేదని అన్నారు. కందుల రామిరెడ్డి ఎవరినో తీసుకునివచ్చి విలేకరుల సమావేశంలో మాట్లాడిస్తే ఎలా అని ప్రశ్నించారు. సన్‌సైన్ ఇన్ ఫ్రా కంపెనీలో తాము లోన్ తీసుకుని ఋణం చెల్లించలేదనే ఆరోపణ చేశారని, తమ ఆస్థులు తాకట్టుపెట్టి రుణం తీసుకున్నామన్నారు. మీ కుటుంబ సభ్యులు కూడా రుణం తీసుకున్న విషయం మర్చిపోరాదని అన్నారు. భూ దందాలపై తామెప్పటి నుంచో బహిరంగ చర్చకు రావాలని కోరుతున్నామని, టిడిపి నేతలు చెన్నకేశవస్వామి గుడికి వచ్చి చర్చిస్తే తాము సిద్ధంగా ఉన్నామని, అప్పుడే వాస్తవాలు తేలుతా యని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ కూడా తమ కుటుంబంపై ఆరోపణలు చేశారని, తాము అప్పుడే బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. జర్నలిస్టుల సమక్షంలో ఆధారాలతో వస్తే తాము మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రజలకు ఆరోజున ఎవరు భూ కబ్జాలకు, భూ దందాలకు పాల్పడ్డారో స్పష్టంగా తెలుస్తుందన్నారు. తాము ఆర్యవైశ్యుల ఆస్థులను కబ్జా చేసినట్లుగా ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైసిపి నాయకులు సిహెచ్ శ్రీనివాసులు, బూదాల సతీష్, రహమతుల్లా, ఉత్తమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాల బోర్డు ఆవిష్కరణ

**ప్రజాశక్తి-కొత్తపట్నం:** మండల పరిధిలోని గమండ్లపాలెం సచివాలయం వద్ద రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.సుజాత, నోడల్ అధికారి బాలచెన్నయ్య, సర్పంచి బద్దెల జాలిరెడ్డి , వైస్ ఎంపిపి తాతా ఉమామహేశ్వరి, మాజీ సర్పంచి బాలగాని నారాయణ మాజీ ఎంపిటిసి తాతా శ్రీను, పంచాయతీ కార్యదర్శి వి. బాలాజీ నాథ్ పాల్గొన్నారు.



## కొంపముంచుతున్న 'జగనన్న భూరక్షణ'

(మొదటి పేజీ తరువాయి)

కూడా పొందారు. కందల్లపల్లె గ్రామంలో గత ఏడాది మార్చిలో రీ సర్వే ప్రారంభమైంది. రీ సర్వే పూర్తయిన తరువాత గత నెల రోజుల క్రితం సాగుదారుల పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. అసైన్డ్ భూములే అయినా... పూర్వీకుల నుంచి సంక్రమించడంతో ఆ భూముల్లో నేటికీ వారు సాగులో ఉన్నారు. సర్వే నెంబరు 39/1లో 3.82 ఎకరాలు, సర్వే నెంబరు 43/5లో 0.94 సెంట్లు సాగులో ఉంది. ఆ భూమికి వారసురాలుగా అప్పల పెద్దక్క భర్త చెన్నయ్య ఉన్నారు. వారికి నలుగురు సంతానం. ఆ భూమిపై ఆధారపడి ఆ కుటుంబం జీవనం సాగిస్తుంది. అప్పల లక్ష్మమ్మ భర్త సుబ్బయ్యకు సర్వే నెంబరు 43/5లో 0.95 సెంట్లు భూమి ఉంది. అప్పల అంజయ్య తండ్రి బాలచెన్నయ్యకు సర్వే నెంబరు 47/1లో 1.79 ఎకరాల భూమి ఉంది. సర్వే నెంబరు 50/2లో 11.49 ఎకరాల భూమిలో మరో ఏడుగురు సాగులో ఉన్నారు. భూమిని కోల్పోయిన వారిలో మారెళ్ల పెద్ద కాశయ్య, బుస్సా వెంకయ్య, అప్పల గురవమ్మ, అప్పల చెన్నకేశవులు, అప్పల వెంకటేశ్వర్లు, అప్పల వెంకటపుల్లారావు, అప్పల వెంకటపుల్లయ్య తదితరులు ఉన్నారు. రీ సర్వేతో తమ కొంప మునిగిందని తెలుసుకున్న బాధితులంతా ఇటీవల మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో అర్జీలు అందించారు. నెల రోజులైనా ఆ సమస్యకు పరిష్కారం చూపలేదు. పైగా మీ సమస్య పరిష్కారం అయ్యిందంటూ స్పందన నుంచి అర్జీదారుల సెల్ నెంబర్లకు సందేశం పంపారు. తమ గ్రామంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా స్పందనలో అర్జీలు ఎలా పరిష్కరిస్తారని బాధితులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో తిరిగి తమ పేర్లు నమోదు చేయాలని కోరుతున్నారు.

## రెవెన్యూ అధికారికి ఫారం7 సెగ

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌ఐలు ఎన్‌సి ప్రసాద్, కె.కమలాకర్, కె అనూక్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. 9 మంది బిఎల్‌ఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఫారం 7 ధరఖాస్తు చేసిన 16 మందిపై కేసు నమోదు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రారంభంలో 3 నెలల పాటు మార్టూరు తహశీల్దారుగా పనిచేసిన బి.సురేష్ బాబుపై ఆరోపణల నేపథ్యంలో కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. అనంతరం కొద్దిరోజుల తర్వాత చుండూరు తహశీల్దారుగా బదిలీ అయ్యాడు. ఫారం 7దరఖాస్తుల విషయంలో చేపటిన విచారణలో సురేష్ బాబు ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేలడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది.

ప్రజాశక్తి 3
శనివారం 25 నవంబరు 2023

## ఎడతెరపి లేకుండా చిరుజల్లులు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా చిరు జల్లులు కురుస్తున్నాయి. పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకోవడానికి ఈ జల్లులు ఆటంకంగా మారాయి. యర్రగొండపాలెం పట్టణంలో దోమల ఉధృతి పెరిగింది. డ్రైనేజీల్లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. కురుస్తున్న చిరు జల్లులకు పత్తి, మిర్చి, కంది తోటల్లో పురుగు ఉధృతి అధికమయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చ . ఇప్పటికే తోటలు తెగుళ్ల బారిన పడడంతో తెగుళ్ల నివారణ కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి పురుగు మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. జల్లులు కురుస్తుండడంతో పురుగు ఉధృతి అధికమయి నిందని వాపోతున్నారు.

# దళితుల భూమిలో పెత్తందారు బోరు

### ఇదేమిటని ప్రశ్నిస్తే ఘర్షణకు దిగుతున్నారు ● అమానుగుడిపాడు దళిత మహిళ ఆవేదన

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

తన భర్త మార్కుకు వికలాంగుల కోటాలో ప్రభుత్వం మంజూరు చేసిన 1.60 ఎకరాల భూమిలో పెత్తందార్లు అక్రమంగా బోరు వేసి ఆ నీటి ద్వారా పంటలు పండించుకుంటున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే ఘర్షణకు దిగుతున్నారని మండల పరిధిలోని అమానుగుడిపాడు గ్రామానికి చెందిన అందుగుల నయోమి అనే దళిత మహిళ వాపోయింది. ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నట్లు తెలిపారు. పెత్తందారు ఆ పొలంలో అక్రమంగా బోరు వేసి వారి పొలాలకు నీరు పెట్టుకుంటున్నట్లు తెలిపింది. ఇదేమని ప్రశ్నిస్తే ఘర్షణకు దిగుతున్నారని వాపోయింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పి మల్లికగర్గ్ దృష్టికి



వాపోతున్న మహిళ

తీసుకెళ్లినట్లు ఆమె తెలిపింది. అక్రమంగా ఏర్పాటు చేసిన బోరును తొలగించాలని జిల్లా కలెక్టర్ రెండుసార్లు తహశీల్దారుకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ తొలగించలేదని ఆమె వాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పొలంలో అక్రమంగా వేసిన బోరును తొలగించి తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంది.

## ప్రభుత్వ సిబ్బందికి అవగాహన

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

వికాస్ భారత్ సంకల్ప్ యాత్రను జనవరి 26 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభుత్వ సిబ్బందికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన పథకాల ప్రయోజనాలు నిర్దేశించబడిన లబ్ధిదారులకు సమయానుకూలంగా చేరేలా చూడాలని తెలిపారు.

తహశీల్దారు కె రవీంద్రారెడ్డి, ఎంపిడివో నాగేశ్వర ప్రసాద్, ఎంఈవో ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కులగణనకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలి

**ప్రజాశక్తి-పుల్లలచెరువు**

రాష్ట్రంలో కులగణన చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దానికి చట్టబద్ధత కల్పించాలని పుల్లలచెరువు మండల అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి ఎలిసెల ఏడుకొండలు డిమాడ్ చేశారు. ఆర్థిక సామాజిక సర్వే తరహాలో వలంటీర్ల చేత కులగణన చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, ఇది కుల అసమానతలను తగ్గించడానికి చేస్తున్నట్లు లేదని, ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం, బీసీ, ఎస్సీలను మభ్యపెట్టడానికి చేస్తున్నట్లుగా కనిపిస్తోందని అన్నారు. జాతీయ స్థాయిలో జనగణనతో పాటు రాష్ట్రంలో కులగణన చేస్తే అది సమగ్రంగా, వివాదాలకు అతీతంగా ఉంటుందని అన్నారు. వలస వెళ్లిన కుటుంబాలను స్వస్థలాలకు రప్పించి కులగణన సర్వేను పారదర్శకంగా అధికారుల ద్వారా చేయించాలని కోరారు.

### అయ్యప్ప స్వామి బంగారు తొడుగుకు..

## రూ.1,51,116 విరాళం అందజేత

**ప్రజాశక్తి-పామూరు**

కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో ఉన్న హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి బంగారు తొడుగుకు కనిగిరి మాజీ శాసనసభ్యులు, వైసీపీ నాయకులు కదిరి బాబురావు రూ.1,51,116 విరాళంగా ఇచ్చారు. కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కదిరి బాబురావుతో అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్లు కావిటి వెంకటసుబ్బయ్య, గుత్తి వెంకట రాజాలు స్వామి వారికి బంగారు తొడుగు అనే కార్యక్రమం మొదలుపెట్టారని, అందులో భాగంగా తమవంతు సహాయ సహకారాలు అందించాలని విన్నవించగా స్పందించిన కదిరి బంగారు తొడుగుకు భారీ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్లు కావిటి వెంకటసుబ్బయ్య, గుత్తి వెంకటరాజా, మిరియం సుబ్బారాయుడు, యరసింగు రాయుడు, మట్లె రాహుల్ యాదవ్, తుమ్మ ఆంజనేయులురెడ్డి పాల్గొన్నారు.

## ఉప ఖజనా కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెంలోని ఉప ఖజనా కార్యాలయాన్ని జిల్లా ఖజనా అధికారి జగన్నాథరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు చేశారు. పెన్షనర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది ఉప ఖజనా కార్యాలయాలు ఉన్నాయని అన్నారు. వాటి ద్వారా జిల్లాల వ్యాప్తంగా 17 వేల మంది పెన్షనర్లకు, అలాగే మరో 25 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## మానసిక వికలాంగులకు సరుకులు పంపిణీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఏ సెక్షన్‌లో చదువుతున్న విద్యారులు తాము దాచుకున్న పాకెట్ మనీ రూ.1400తో మాచర్ల రోడ్డులోని సన్‌జో సేవాలయంలో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులకు శుక్రవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సంధర్భంగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు డి బాలునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులు అందజేయడం శుభ పరిణామమన్నారు. ఏ ఆధారం లేని నిరాశ్రయులైన మానసిక వికలాంగులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మానసిక వికలాంగులకు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు చిట్టి నాయక్, యోగయ్య నాయక్, ఆశ్రయం నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని మహిళ మృతి

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

భర్త తిట్టాడని మనస్తాపంతో వివాహిత ఉరేసుకొని మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని శానంపూడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. శానంపూడి ఎస్‌సికాలనీకి చెందిన పెనుమల్లి సుస్మిత, (24) తన ఇంట్లో ఉరేసుకొని మృతిచెందాడు. మృతురాలు స్వగ్రామం జరుగుమల్లి మండలం నందనవనం. ఆమెకు ఆరు సంవత్సరాల క్రితం శానంపూడికి చెందిన శ్రీకాంత్‌తో వివాహమైంది. వారికి కుమార్తె ఉంది. శ్రీకాంత్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. శ్రీకాంత్ శుక్రవారం సుస్మితను కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన సుస్మిత ఉరేసుకొని మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఎస్‌ఐ టి. శ్రీరామ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోగొట్టుకున్న పర్సును అందజేసిన కండక్టర్

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

తనకు దొరికిన డబ్బుల పర్సును బాధితురాలికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు గిద్దలూరు ఆర్టీసీ డిపో కండక్టర్ ఉలాపు శంకర నాయుడు. కంభం నుంచి పాపినేనిపల్లి బస్సులో ప్రయాణిస్తున్న పాపినేనిపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి బస్సులో పర్సు మర్చిపోయి దిగిపోయింది. గమనించిన కండక్టర్ శంకర్ నాయుడు పర్సు భద్రపరిచి ఈ విషయాన్ని ఆర్టీసీ డిఎం దృష్టికి తీసుకెళ్లగా వివరాలు సేకరించి బాధితులకు అందజేయాలని డిఎం సలహా ఇచ్చారు. పర్సు అడ్రస్ వివరాల ప్రకారం పాపినేనిపల్లి గ్రామపెద్దల సమక్షంలో సుమారు 22 వేలు రూపాయలు నగదు కలిగిన పర్సును నాగలక్ష్మికి తిరిగి అప్పగించారు. కండక్టర్ శంకర్ నాయుడు నిజాయితీని, వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధతను కొనియాడుతూ పాపినేనిపల్లి గ్రామస్తులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డ్రైవర్ శాయన్న, బాధితురాలు నాగలక్ష్మి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## కందిపంటలో సస్యరక్షణ పాటించాలి: ఏఓ

**ప్రజాశక్తి-పొదిలి**

వరిలో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా ఆకుమచ్చ, ఉల్లి కోడులను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దిన్ అన్నారు. శుక్రవారం మండలం తలమళ గ్రామంలో రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగుచేసిన బిపిటి 5204 రకం వరి విత్తనాలను 30 బస్తాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## దారపనేనిని పరామర్శించిన జంకె, బన్నీ

**ప్రజాశక్తి-పామూరు**



దారపనేనిని పరామర్శిస్తున్న జంకె తదితరులు

కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌ను శుక్రవారం పామూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, ప్రకాశం జిల్లా కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు చైర్మన్ వై ఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ) పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో స్వగ్రామానికి తిరిగి వచ్చిన సందర్భంగా సమాచారం తెలుసుకున్న జంకే వెంకటరెడ్డి, బన్నీ దారపనేనిని పరామర్శించారు. దారపనేని చంద్రశేఖర్ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా స్వగ్రామానికి తిరిగి రావడం చాలా ఆనందదాయకమని వారు తెలిపారు. సిఎస్‌పురం మండలం అయ్యవారిపల్లె సర్పంచ్ ముత్యాల భారతి నారాయణరెడ్డి, పామూరు మండల వైసీపీ సీనియర్ నాయకులు వివేక, ఒమేగ విద్యాసంస్థల కరస్పాండెంట్ కల్లూరి రామిరెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న గ్యాస్ సిలిండర్ల లారీ

## రెండు లారీలు ఢీ

### తృటిలో తప్పిన పెను ప్రమాదం

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి నగర పంచాయతీ పరిధిలోని మాచవరం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ లారీ ఇసుక లారీ ఢీకొన్నాయి. కనిగిరి నుంచి పామూరు వైపు వెళుతున్న ఇండేన్ గ్యాస్ కంపెనీకి చెందిన లారీ గ్యాస్ ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొన్నాయి. దీంతో రోడ్డు మీద గ్యాస్ సిలిండర్లు చల్లా




చెదురుగా పడిపోయాయి. అదృష్టవశాత్తు గ్యాస్ సిలిండర్లు లీక్ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిపోయింది. ఈ ఘటనలో రెండు లారీలలో ఉన్న డ్రైవర్ క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న సిలిండర్లను పక్కకు తొలగించేలా చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా చూశారు. ప్రమాదానికి గల కారణాలను విచారిస్తున్నారు.

## జూదరులు అరెస్టు

**ప్రజాశక్తి-పంగులూరు**

మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలో ముగ్గురు పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు రేణింగవరం ఎస్‌ఐ తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.6,360 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట, కోడిపందాలు లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలోని మార్కాపురం రోడ్డులో 565 జాతీయ రహదారికి ఆనుకొని వివేకానంద విగ్రహం వద్ద నున్న ఓ ప్రైవేటు ఆసుపత్రి వైపు శుక్రవారం ట్రాక్టర్ అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ సమయంలో ట్రాక్టర్ అక్కడ ఉన్న ఒక స్కూటీని ఢీకొంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అక్కడున్న స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాక్టర్‌కు బ్రేకులు సరిగా పడకపోవడం వలనే అదుపు తప్పిందని తెలియవచ్చింది.

## ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ సమావేశం

**ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్**

ఎస్‌ఎఫ్‌ఐ గిద్దలూరు కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల సొంత భవనం నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన ఫీజులు విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల:** పెద్దదోర్నాలలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ భాస్కర్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి తెలిపారు.



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న చేనేత ప్రతినిధులు

## చేనేత కార్మికులకు మజూరి పెంచాలి

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

రెక్కాడితే కాని డొక్కనిండని చేనేత కార్మికుల మజూరీలు పెంచాలని చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు మర్రిపాడు వెంకటరావు, మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. మజూరీలు పెంచాలని కోరుతూ తహశీల్దార్ డి వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరావు, సత్యనారాయణ, బాలాజీ మాట్లాడుతూ చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకుని బతుకు సాగిస్తున్న నేత కార్మికులు చాలీచాలని మజూరీలతో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు కొనలేక అర్ద ఆకలితో బతుకు సాగిస్తున్నారని అన్నారు. కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతకు కేంద్రంగా ఉన్న మంగళగిరిలో చేనేత కార్మికులకు మజూరీలు పెంచిన విధంగా మండలంలోని చేనేత కార్మికులకు నూటికి 15శాతం మజూరీలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత నాయనులు కౌతరపు సీతారామయ్య, దొంతు శ్రీనివాసరావు, దీపాల సత్యనారాయణ, టి రామకృష్ణ, దివి రాధాకృష్ణ మూర్తి, దామర్ల లక్ష్మీ శ్రీనివాసరావు, జి వెంకట్ నారాయణ, కె కేశవ, రామకృష్ణ పాల్గొన్నారు.




ఐడి కార్డులు అందజేస్తున్న ఆర్‌డిఒ హేలా షారోన్

## ఓటరు జాబితాపై సమీక్ష

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

విధి నిర్వహణలో బిఎల్వోలు, సూపర్వైజర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఎన్నికల సిబ్బందితో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా డిసెంబర్ 9లోగా ప్రతి బిఎల్ఓ తమ పోలింగ్ బూత్ పరిధిలో 18, 19సంవత్సరాల వయసు కలిగిన వారికి నూతనంగా ఓటు హక్కు కల్పించాలని అన్నారు. బిఎల్ఓ 40నుండి 50ఓట్లను నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు చేర్పులను నిర్దేశిత సమయమైన వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కోరారు. ప్రతి ఫైలుకు ఫిజికల్ ఫైలు నిర్వహించాలని తహసిల్దార్ బి వెంకటేశ్వర్లు సూచించారు.



డార్విన్ గార్డెన్‌లో విద్యార్థులకు జీవ పరిణామం అవగాహన

## జీవ పరిణామ దినోత్సవం

**ప్రజాశక్తి - బాపట్ల**

మానవ జాతి పుట్టుక పరిణామంపై డార్విన్ సిద్ధాంతంపై జెవివి సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులకు వివరించారు. జీవజాతుల పుట్టుక గ్రంథాన్ని ప్రచురించిన దినోత్సవ సందర్భంగా జెవివి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విజయలక్ష్మి పురంలోని డాక్టర్ దోప్పలపూడి మల్లికార్జునరావు చార్లెస్ డార్విన్ గార్డెన్‌ను మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌కు చెందిన బాల బాలికలు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్ మానవ పుట్టుక పరిణామ సిద్ధాంతంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో దొప్పలపూడి రామ్మోహనరావు, హెచ్‌ఎం దుర్గాదేవి, ప్రగతి స్కూల్ చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భూములు సాధించే వరకూ పోరాటం

### సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

**ప్రజాశక్తి - పంగులూరు**

పేదలంతా ఐక్యంగా నిలబడి, భూములను సాధించుకునే వరకు పోరాటం చేయాలని, పోరాటం చేయనిదే ఫలితం రాదని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన అలవలపాడు ,తూర్పు తక్కెలపాడు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల పేదల సమావేశంలో మాట్లాడారు. 1976లో కుటుంబం నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి పట్టాలు ఇచ్చార అన్నారు. కానీ ఆపరేషన్ చేయించుకున్న కొంతమందికి భూములు చూపించి కొంతమందికి చూపించలేదని అన్నారు. భూములు చూపించిన వాటిలో కూడా కొంతమంది భూములు భూస్వాములు దౌర్జన్యంగా వెనక్కి లాక్కున్నారని అన్నారు. ఇది చాలా దారుణమని అన్నారు. 22మందికి నేటికీ



మాట్లాడుతున్న సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

భూములు చూప లేదని అన్నారు. దశాబ్దాల తరబడి అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగినా ఫలితం రాలేదని అన్నారు. ఇంతకాలం ఏం చేస్తున్నారని అధికారులు పేదలను ప్రశ్నిస్తున్నారని అన్నారు. అధికారుల చుట్టూ తిరిగినా కోర్టులు చుట్టూ తిరిగిన ఫలితం కాన రాలేదని, పేదలు నిరుత్సాహ పడకూడదని, భూములు సాధించేందుకు పోరాడాలని అన్నారు. ఇందుకోసం సిపిఎం నిలబడుతుందని చెప్పారు. సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ పేదల హక్కుల కోసం పోరాడేది సిపిఎం ఒకటేనని అన్నారు. భూ పోరాటాలు, ఇళ్ల స్థలాల పోరాటాలు, వివక్షకు వ్యతిరేక పోరాటాల వంటి ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర సిపిఎంకి ఉందని అన్నారు. భూస్వాముల దగ్గర నుండి భూమిని లాక్కోవడం అంత సులువైన పని కాదని అన్నారు. ఐక్యంగా పోరాడితేనే సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం భూ పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు గుడిపాటి మల్లారెడ్డి, వేమూరి సునంద బాబు, పాలపర్తి రవి, ప్రేమ్ కుమార్, కుంట ఆదాం, పాలపర్తి సందీప్, మురికిపూడి అబ్దుల్లా, ఎం కోటేశ్వరరావు, ఎర్రమోతు రత్తయ్య, నూతలపాటి ఆశీర్వాదం, పత్తిపాటి కిరణ్, దుడ్డు సుబ్బారావు పాల్గొన్నారు.

## మహాధర్నాను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - బాపట్ల**

దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు విజయవాడలో నవంబర్ 27, 28తేదీల్లో జరిగే కార్మిక, రైతు మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక పాత బస్టాండ్ ఆటో స్టాండులో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశానికి వ్యతిరేకమైన, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తుందని అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుండి దింపటమే సరైన మార్గమని అన్నారు. మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రైతుల పోరాటంతోనే రద్దు చేసిందని అన్నారు. ఆ సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని అన్నారు. పంటకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారని గుర్తు చేశారు. విద్యుత్తు రంగాన్ని ప్రైవేటుపరం చేయమని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. కార్మిక చట్టాలను నాలుగు



కరపత్రం ఆవిష్కరిస్తున్న సిఐటియు కార్యదర్శి మజుందర్

లేబర్ కోడ్స్‌గా మార్చారని అన్నారు. కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున కార్మిక, కర్షకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు మహా ధర్నాకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి జె సామేలు, సిఐటియు నాయకులు బి బుచ్చిరాజు, బ్రహ్మం, వాసు, కుమార్ పాల్గొన్నారు.



ఎంపికైన గుంటూరు జిల్లా బాలికల కబడ్డీ జట్టు

## మహిళల కబడ్డీ జట్టు ఎంపిక

**ప్రజాశక్తి బాపట్ల**

ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా కబడ్డీ జట్టు ఎంపిక స్థానిక మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించినట్లు హై స్కూలు పిడి కత్తి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. కబడి జిల్లా జట్టు ఎంపికకు 40మంది క్రీడాకారిణిలు హాజరైనట్లు తెలిపారు. వారిలో ప్రతిభగల 12మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన కబడి మహిళల జట్టు ఈనెల 29, 30, డిసెంబరు 1న కర్నూలులో జరిగే 70వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ జట్టు ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. జట్టులో జి పూర్ణిమ (గుంటూరు), పి వరలక్ష్మి (బొల్లాపల్లి), ఎ' దీపిక (బాపట్ల), బి శివమాయి (నకరికల్లు), త్రివేణి (నరసరావుపేట), జి లావణ్య (లోయపల్లి), పి భార్గవి (చిన లింగాయపాలెం), బి ప్రేమ చందన (బాపట్ల), ఎస్ వసంత (ఖాజీపాలెం), బి రమాదేవి (నిజాంపట్నం), ఎం స్వాతి (పోతురాజు కొత్తపాలెం), టి అనిత (కొచ్చర్ల), కె మహాలక్ష్మి (ఎన్ఆర్ తోట), ఎన్ కావ్య (నండూరు), ఎం లావణ్య (పాండురంగాపురం), పి యామిని (వైఎస్ నగరం) ఉన్నట్లు తెలిపారు. జట్ల ఎంపిక గుంటూరు జిల్లా క్రీడా కార్యదర్శి సుబ్బరాజు ఆధ్వర్యంలో పీడీ జి కుటుంబరావు, వై రాము, పిఈటి వైఎస్ఆర్ ప్రసాద్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పి నాగులు ఎంపిక చేసినట్లు తెలిపారు.

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి - బాపట్ల**

బులియన్స్ మర్చంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక బాపట్లలో శుక్రవారం నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా వెదురుపర్తి లక్ష్మణ్ మూర్తి, కార్యదర్శిగా దొడ్డ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చీరాల, అద్దంకి జ్యువెలరీ అసోసియేషన్ల సహకారంతో ఏర్పాటైన బాపట్ల జిల్లా అసోసియేషన్‌లో బాపట్ల, పర్చూరు, అద్దంకి, మేదరమెట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి, రేపల్లె బులియన్ మర్చంట్స్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార ప్రక్రియను రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయం కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. నూతన అధ్యక్షులు వెదురుపర్తి లక్ష్మణమూర్తి, బాపట్ల గౌరవ అధ్యక్షులు మోదడుగు నరేష్ గుప్తా (బాపట్ల), కార్యదర్శి బొలిశెట్టి నరసింహస్వామి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

(చీరాల), కోశాధికారి సాధు సత్యనారాయణ (అద్దంకి), కరస్పాండెంట్ దొడ్డరామకృష్ణ (బాపట్ల) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో కపిలవాయి విజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ ఏర్పాటుకు సహకరించిన శాసనసభ్యులు కోన రఘుపతికి కృతజ్ఞతలు తెలిపారు.



వరిపైరు పరిశీలిస్తున్న ఎఒ టి బాలాజీ గంగాధర్

## పొలాలలో నీటిని తీసేయండి

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంట పొలాలలో నీరు నిలబడినట్లయితే వాటిని తీసివేయాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని రాంబట్లపాలెం, కావూరు, తుమ్మలపాలెం గ్రామాలలో వరి పొలాలను శుక్రవారం సందర్శించారు. వాతావరణం తేమగా ఉండటం వలన చిగురు, పుష్ప దశలో ఉన్నటువంటి వరి కంకులకు నీరు చేరి మాను పండు శిలీంద్రం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు ప్రాపి కొనజోల్ ఒక మిల్లీ లీటర్, లీటరు నీటికి కలిపి వెన్నులు పైకి వచ్చే దశలో ఒకసారి, వారం తర్వాత ఒకసారి పిచికారి చేయాలని సూచించారు. దీని ద్వారా మాను పండు తెగులను నివారించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎఇఒలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 'ఆడుదాం ఆంధ్ర' కోసం నమోదు చేయించుకోవాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుతా ఆంధ్ర కార్యక్రమానికి యువతీ, యువకులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఎంపీపీ డివి లలిత కుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. 15 సంవత్సరాలు పైబడిన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 27నుండి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ వంటి ఆటల్లో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. నమోదు చేయించుకున్న వారికి క్రీడా సామాగ్రి, దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి నగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డివి లలితకుమారి

బాహుమతులు ఇస్తారని తెలిపారు. మహిళా క్రీడాకారులకు కూడా ప్రత్యేక టీంలు ఉన్నాయని తెలిపారు. సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరుగుదుల ఉదయభాస్కరి, తహశీల్దారు డి వెంకటేశ్వరరావు, ఎంపీడీఒ గుమ్మా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# రైల్వే రంగాన్ని కాపాడాలి

## కంభం స్టేషన్ వద్ద సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాశక్తి-కంభం రూరల్**

రైల్వే రంగాన్ని ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, ప్రైవేటీకరణను చేయరాదని కోరుతూ శుక్రవారం కంభం రైల్వేస్టేషన్ వద్ద సిఐటియు, ప్రజాసంఘాలు నిరసన తెలియజేశాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ బిజెపి దేశంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగాలన్నిటిని కారుచౌకగా ప్రవేట్ కంపెనీలకు అమ్మేస్తోందని విమర్శించారు. ప్రపంచంలోనే పేరుగాంచిన రైల్వేలో ఇప్పటికే వంద స్టేషన్లను, 100 రైళ్లను ప్రైవేట్ వాళ్లకు అప్పజెప్పడం ద్వారా ప్రభుత్వం సామాన్య ప్రజానీకానికి కాకుండా కార్పొరేట్ కంపెనీలకే దాసోహం అంటున్న విషయం అర్థం అవుతోందన్నారు. నేడు ప్రమాదాలు జరగడానికి రైల్వేలో దాదాపు 4 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండటమే కారణమని అన్నారు. వాటిని భర్తీ చేయకుండా ఉన్నందువలన పనిభారం పెరుగుతుందని మరోపక్క ట్రాకుల మరమ్మతులు, సిగ్నల్ సిస్టం సరిగా లేనందువల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రైలు ప్రమాదాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కాలంలో ప్యాసింజర్ రైళ్ల, ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను రద్దు చేశారని, వీటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్‌లో రైల్వే డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ రైల్వేల మీద ఆధారపడి లక్షల మంది జీవిస్తున్నారని, రోజుకు మూడు కోట్ల మంది ప్రజానీకాన్ని దేశం నలుమూలలకు చేరవేస్తున్న ఈ రంగాన్ని, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలకు అవసరమైన అన్ని సరుకులను రవాణా చేస్తున్న ఈ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం అంటే దేశ స్వాతంత్ర లక్ష్యాన్ని పూర్తిగా తిరగరాయడమేనని అన్నారు. రైల్వే రంగాన్ని ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. దీనిని కాపాడుకోవటం ప్రజలందరూ కర్తవ్యంగా స్వీకరించి బిజెపి విధానాలు తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజావలి, గౌరవాధ్యక్షులు సయ్యద్ కొత్తూరు, ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ సుభాని, వి.ఏ.ఎల నాయకురాలు దొంటా వెంకరత్నం, టి దానం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

## నారా లోకేష్‌ను కలిసిన డాక్టర్ ఉగ్ర

**ప్రజాశక్తి-కనిగిరి**


నారా లోకేష్‌తో డాక్టర్ ఉగ్ర

కనిగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను హైదరాబాదులో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కనిగిరి నియోజక వర్గంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య కార్యక్రమాలను, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి చేస్తున్న కృషిని డాక్టర్ ఉగ్ర నారా లోకేష్‌కు వివరించారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తూ చైతన్య పరుస్తున్నట్లు డాక్టర్ ఉగ్ర లోకేష్‌కు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్రను నారా లోకేష్ అభినందించారు.

## బూచేపల్లి రూ.25 వేలు సాయం

**ప్రజాశక్తి-దొనకొండ**

మండల కేంద్రమైన దొనకొండలోని పేద కుటుంబానికి చెందిన నవ వధువుకు దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. బ్రహ్మారావుపేటకు చెందిన దివంగత కందుకూరి వెంకటేశ్వర్లు(కొండలు) కుమార్తె వివాహం సందర్భంగా వారి కుటుంబ పేదరిక పరిస్థితి మండల వైసిపి మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి బూచేపల్లి శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించి బూచేపల్లి అందించిన రూ.25 వేల నగదును కృష్ణారెడ్డి శుక్రవారం జరిగే వివాహానికి హాజరై పెండ్లి కూతురుకు నగదును అందజేశారు. అందుకు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'బాబు ష్యూరిటీ'ని త్వరితగతిన పూర్తి చేయాలి

### లోకేష్ టీమ్ సభ్యుడు హరీష్‌రెడ్డి

**ప్రజాశక్తి-వెలిగండ్ల**



మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షులు వెంకటరెడ్డి

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం బూత్ కమిటీ సభ్యులు త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ టీమ్ సభ్యుడు హరీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌ఛార్జి ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం 45 రోజుల కార్యక్రమంలో ఇప్పటికే 24 రోజులు పూర్తయిందని, అయినా 50 శాతం పూర్తి కాలేదని, ఇంకా 21 రోజుల్లో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తెలుగుదేశం యొక్క విధానాన్ని ప్రజలకు తెలియజేసి రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలం టీడీపీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాలరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కారంపూడి వెంకటేశ్వర్లు, యూనిట్ సభ్యులు కొండ్రు శ్రీనివాసరెడ్డి, పెరుగు శివ, ఉపాధ్యక్షుడు బొప్పారాజు లక్ష్మీ నారాయణ, కొండు భాస్కరరెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, టీ సుబ్రహ్మణ్యం, పోకల పులారెడ్డి, నల్లబోతుల నాగరాజు, సానా నారాయణరెడ్డి, బాలకోటిరెడ్డి, అక్కి శ్రీను, నాగార్జునరెడ్డి తగరం అంకయ్య తదితరులు పాల్గొన్నారు.


తెప్పోత్సవం తిలకిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

## వైభవంగా చెన్నకేశవుని తెప్పోత్సవం

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి తెప్పోత్సవం చెన్నకేశవుని పుష్కరిణి (కోనేరు)లో శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. తెప్పోత్సవాన్ని రంగురంగుల విద్యుత్ కాంతులతో ఆకర్షించేలా ఏర్పాటు చేశారు. పుష్కరిణి నీటిలో ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవానికి శాశ్వత ఉభయదాతగా శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ కుటుంబీకులు వ్యవహరిస్తున్నారు. ఈ వేడుకను తిలకించేందుకు మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. వేడుక అనంతరం అల్పాహారం అందించారు. ఈ వేడుకలను ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కుటుంబీకులతో కలిసి తిలకించారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. మార్కాపురం డిఎస్‌పి జి వీరరాఘవరెడ్డి, సిఐ ఎం భీమానాయక్‌ల సారథ్యంలో పట్టణ ఎస్ఐ పి కోటేశ్వరరావు, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్‌లతో పాటు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


సిఎం పుష్పగుచ్ఛం ఇస్తున్న వరికూటి అశోక్‌బాబు

## జగన్‌తో వరికూటి భేటీ

**ప్రజాశక్తి-టంగుటూరు**

కొండపి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, పార్టీ పురోగతే తమ సర్వస్వమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో వరికూటి అశోక్‌బాబు ఆయన వరికూటి లక్ష్మీ, కుమారుడు గౌతమ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్ బాబు కొండపి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యల గురించి సిఎం వివరించారు. స్పందించిన సిఎం జగన్ అంతా మంచే జరుగుతుందని హామీ ఇచ్చినట్లు అశోక్‌బాబు తెలిపారు.


కరపత్ర ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

## మహాధర్నాను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపుమేరకు విజయవాడ జింఖానా గ్రౌండ్లో ఈ నెల 27, 28న జరిగే కార్మిక రైతు మహాధర్నాకు జిల్లా నుంచి వందలాది మందిగా కదలి రావాలని సిఐటియు పిలుపునిచ్చింది. శుక్రవారం వెలిగండ్ల మండల కేంద్రంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు, ప్రజలకు, దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందని, ఇటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించడమే సరైన మార్గమని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాల పాలనలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలరూ. రూ.14 లక్షల కోట్ల బ్యాంకు బకాయిలు రద్దు చేసిందని, అదే సమయంలో రైతుల బకాయిలు రద్దు చేయడానికి నిరాకరించిందని వారు విమర్శించారు. రాష్ట్ర వైసిపి ప్రభుత్వం మోడీ ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల వ్యతిరేకంగా పోరాటం చేయలేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27, 28 విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.

## పంటలను పరిశీలించిన అధికారులు

**ప్రజాశక్తి- రాచర్ల**


మిర్చిపంటను పరిశీలిస్తున్న అధికారులు

మండల పరిధిలోని అనుమలవీడు గ్రామానికి చెందిన రేగలగడ్డ లక్ష్మమ్మ పొలంలో గత సెప్టెంబర్‌లో జిల్లా వనరుల కేంద్రం అధికారులు ఆధ్వర్యంలో పూస హైడ్రోజల్‌ను ప్రయోగాత్మకంగా పశువుల ఎరువుతో కలిపి మిరప పొలం దుక్కిలో వేశారు. అందులో భాగంగా ఆ పొలంలో సాగు చేసిన మిర్చి పంటను జిల్లా వనరుల కేంద్రం పీడీ అన్నపూర్ణమ్మ , గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ పూస హైడ్రోజన్ దుక్కిలో వేసిన పొలాలు, సాధారణ పొలంలోని తేడా పరిశీలించినట్లు తెలిపారు. పూస హైడ్రోజన్ వేసి పొలం తొందరగా బెట్టకు రావడం లేదన్నారు. పంట పెరుగుదల కూడా బాగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సాంకేతిక వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా, రాచర్ల ఎఒ అబ్దుల్ రఫీక్ , జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి వీరగంధం వెంకట శేషమ్మ , వ్యవసాయ విస్తరణ అధికారి బి. సంపత్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు బి. సాయి మౌనిక , రైతులు పాల్గొన్నారు.

## గృహ ప్రవేశవేడుకల్లో బూచేపల్లి

**ప్రజాశక్తి-దర్శి**

స్థానిక టీచర్స్ కాలనీలో పేరం మాలకొండారెడ్డి, శివకుమారిల నూతన గృహప్రవేశానికి దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు శివారెడ్డి, కోటిరెడ్డి, రమణారెడ్డి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి సైకిల్ యాత్ర

**ప్రజాశక్తి-దర్శి**

వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని టీడీపీ మాజీ లీగల్ సెల్ అధ్యక్షులు పఠాన సురేష్ అన్నారు. తాళ్లూరు మండలం మాధవరం గ్రామంలో సైకిల్ యాత్ర పదో రోజు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సముద్ర స్నానాల ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎంపిడిఒ

## సముద్ర స్నానాల ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాశక్తి - వేటపాలెం**

కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఒ కె నేతాజీ తెలిపారు. మండలంలోని రామాపురం సముద్ర తీర ప్రాంతంలో కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలను పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పది మంది గజ ఈతగాళ్ళు, ఆపద మిత్రాలు సిద్ధంగా ఉంటారని అన్నారు. సముద్ర స్నానం అనంతరం స్నానాలు చేయటానికి మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఆపద సమయంలో ఆదుకునే విధంగా బోట్లు కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. పరిసరాల శుభ్రత పైన ఎక్కువ దృష్టి పెట్టి చెత్త కుండీలను ఏర్పాటు చేశామని అన్నారు, ఆయన వెంట ఈఓఆర్డి సజ్జ శ్రీలక్ష్మి, పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ ఐ కాశీ విశ్వనాథం, కార్యదర్శి పి పూర్ణ కుమారి పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న విజయబాబు

## వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)**

వేమూరు మండలం పెరవలి గ్రామంలో వరి పంటను ఆశించిన సుడిదోమ నివారణపై బాపట్ల వ్యవసాయ శిక్షణ కేంద్రం అధికారి ఆర్ విజయబాబు రైతులకు శుక్రవారం సూచనలు చేశారు. వరి పంటను ఆయన పరిశీలించారు. సుడిదోమ, మెడ విరుపు నివారణకు చేపట్టాల్సిన సశరక్షణ చర్యలపై రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో జొన్న, మొక్కజొన్న, అపరాలు సాగు చేసే రైతులు వ్యవసాయ మెలుకువలు కలిగి ఉండాలని అన్నారు. ఏడాది రబీ సీజన్‌కు సాగునీరు అందే పరిస్థితి లేనందున బోరు వసతి లేని రైతులు అపరాల సాగుకు సిద్ధపడాలని సూచించారు. సాగు చేసే పంటలను ఎప్పటికప్పుడు వ్యవసాయ సిబ్బంది ద్వారా తగిన సలహాలు సూచనలు పొంది మెరుగైన ఉత్పత్తుల సాధించాలని పేర్కొన్నారు. ఎఒ సునీత, విఎఎ డి నాగార్జున పాల్గొన్నారు.ద

## 27న మినీ జాబ్ మేళా

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 27న మార్టూరు కొణిదెన రోడ్డులోని విఎస్ఆర్ అండ్ ఏఎం డిగ్రీ కాలేజీ నందు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ తమ్మాజీ శుక్రవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, ఫ్లక్స్‌టెక్ సొల్యూషన్స్, అల్‌సెట్ బిజినెస్, ముత్తూట్ ఫైనాన్స్, జోయాలుక్కాస్ కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. 150కి పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హతను బట్టి రూ.10వేల నుండి రూ.30వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బిటెక్, డిప్లొమా, ఫార్మసి, ఎంఎస్సి, ఎంసిఎ, బిఎస్సి (కెమిస్ట్రీ), ఎంఎస్సి (కెమిస్ట్రీ), ఎంబిఎ, పిజి విభాగంల వరకు చదువుకున్న 18నుండి 35సంవత్సరాల నిరుద్యోగ యువతీ, యువకులు పూర్తి బయోడేటా లేదా రెస్యూమ్ తోపాటు పాస్ పోర్ట్ ఫోటోతో హాజరు కావాలని కోరారు. ఈ నెల 27న ఉదయం 9గంటల నుండి సాయంత్రం వరకు నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కావాల్సిందిగా కోరారు. వివరాలకు పి శ్రీకాంత్ 79896 97996, పి వినోద్ 6302764962 సంప్రదించాలని తెలిపారు.

# వైసిపి పాలనలో ప్రతిఇంటికీ సంక్షేమ పథకం



మాట్లాడుతున్న వైసిపి పట్టణ అధ్యక్షుడు కొండ్రు బాబ్జి



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

**ప్రజాశక్తి - చీరాల**

వైసీపీ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులు అందరికీ సంక్షేమ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటికి అందిస్తున్నదని వైసిపి పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జి అన్నారు. శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇంచార్జీ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు పట్టణంలోని 32వ వార్డు కౌన్సిలర్ గొట్టిపాటి ఎబినేజరు అధ్యక్షతన క్లస్టర్ 1లో జయంతిపేట సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్ కి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వెంకటేష్ బాబును ఎమ్మెల్యేగా గెలిపించుకొని నియోజక వర్గంలో వైసిపి జెండా ఎగరవేయాలని నాయకులను కోరారు. కార్యక్రమంలో జేసీస్ పట్టణ ఇంచార్జీ కోలా శివ, వైసిపి జిల్లా కార్యదర్శి శిఖా సురేష్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనిల్, కో ఆప్షన్ షేక్ కబీర్, కలవకూరి యానాదిరావు, మించాల సాంబశివ రావు, షేక్ సుభానీ, డొక్కా ప్రవీణ్, దుడ్డు సైమన్, జంగా ప్రేమ్ కుమార్, బొల్లాపల్లి అనిల్, తలకాయల సుధీర్, బొల్లాపల్లి వెంకట్రావ్, తేళ్ళ రాంబాబు, కాకి జాన్, గొట్టిపాటి ప్రసన్న పాల్గొన్నారు.

**వేటపాలెం :** మండలంలోని అక్కాయపాలెం సచివాలయం పరిధిలో రూ.24కోట్లకుపైగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందారని ఎంపీడీఒ నేతాజీ తెలిపారు జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తొలుత వైసిపి జెండా ఎగరవేశారు. సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. ఈఓఆర్డి సజ్జ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పరణం పూర్ణ కుమారి, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు పులి వెంకటేశ్వర్లు, జెసిఎస్ మండల ఇన్చార్జ్ లేళ్ల శ్రీధర్, మండల మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, మాజీ సర్పంచ్ జంగిలి రామారావు, పిన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచి సాంబిరెడ్డి, ఖాదర్, దంత హనుమంతు, పృధ్వి చంద్రమోహన్, ఆవుల అశోక్, ఆవుల కొండలు, సున్నపు సుబ్బారావు, పులి శ్రీనివాసరావు, పులి హరికృష్ణ, పూరిమెట్ల వెంకటేశ్వర్లు, కొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, గవిని వెంకట్రావు, ఆతిన వెంకట్రావు, విజయ్, కర్ర వెంకటేశ్వర్లు, హౌలీ పాల్గొన్నారు

**రేపల్లె :** రాష్ట్ర అభివృద్ధికి సిఎం జగనన్న సేవలు ఎంతో అవసరమని కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 14, 15వార్డులో శుక్రవారం నిర్వహించిన వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని అన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులను, నేతన్నలను, మత్స్యకారులను, స్వయం ఉపాధి కలిగిన ప్రతి ఒక్కరికి బాసటగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. పరాదర్శకంగా లబ్దిదారుల ఖాతాలలో నగదును జమచేస్తూ ఆర్థిక సహాయం అందించారని అన్నారు. గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం ద్వారా అధికారులను ప్రజల వద్దకు చేర్చారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సేవలను ప్రజలు గుర్తించాలని కోరారు. మరోసారి గెలిపించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పొందిన లబ్దిని తెలియజేసే కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగా, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, విశ్వనాథ గుప్తా, వైసిపి పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి, చదలవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేపల్లెలో సంక్షేమ పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్

## సచివాలయంలో వైసిపి జెండా ఆవిష్కరణ

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

మండలంలోని సూర్యపల్లి గ్రామంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమా న్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ డివి లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వివరించారు. ఇప్పటివరకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరివిధుల ఉదయభాస్కరి, సర్పంచి మోర్ల విజయలక్ష్మి, వైసిపి కన్వీనర్ మోర్ల శ్రీనివాస రావు, పిఎసిఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి శేషాచలా శ్రీనివాస రావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, ఎంపీటీసీ రావు రాజేశ్వరి, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ, కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

**నిబంధనలకు విరుద్ధంగా జెండా ఆవిష్కరణ**

గ్రామ పంచాయతీల వద్ద జరిగే రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలని కార్యక్రమంలో పార్టీ జండాను పార్టీ కార్యాలయల వద్ద లేక ఇతర ప్రాంతాల్లో ఆవిష్కరించాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా సూర్యపల్లి గ్రామంలో సాక్షాత్తు సచివాలయం వద్దనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దిమ్మెపై జెండా ఆవిష్కరించటం తీవ్ర విమర్శలకు కారణమైంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల బోర్డులు మాత్రమే కార్యాలయం వద్ద ఆవిష్కరించాల్సి ఉంది. కానీ సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించటం ప్రజలను విస్మయానికి గురిచేస్తుంది.

# అపరాలు కొనేవారేరీ..?

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రైతులకు అన్ని విధాల రాయితీలతో విత్తనాలు, పురుగు మందులు అందజేస్తా మని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారాయి. గత ఏడాది కాలంగా రైతు భరోసా కేంద్రాలు ఎక్కడ పనిచేయటం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజను ముగిసి రబీ సీజన్‌కు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది డెల్టా ప్రాంతంలో బోరు వసతులు లేని అనేక ప్రాంతాల్లో జొన్న, మొక్కజొన్న పంటకు బదులుగా అపరాలు సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ప్రభుత్వం జిల్లా, మండలాల వారీగా రైతు సలహా మండలి కమిటీలను ఏర్పాటు చేసింది. గత 20రోజుల క్రితం భట్టిప్రోలు మండల వ్యవసాయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ ఏడాది రైతులకు రబీ సీజన్‌కు గాను ఆపరాలను రాయితీపై అందజేయాలని నిర్ణయించారు. ఆ మేరకు నివేదికలు ప్రభుత్వానికి అందజేశారు. పంటలు కోత దశకు చేరుకుంది. అక్కడక్కడ కోతలు కూడా ప్రారంభమైనప్పటికీ నేటికీ ఎక్కడ ఒక గింజ అపరాలు రైతులకు అందుబాటులోకి రాలేదు. అపరాలు సాగు చేయదలుచుకున్నా రైతులకు బయట వ్యాపారుల వద్ద మినుములు రూ.10వేల పైగాను, పెసలు రూ.12వేలకు పైగా క్వింటా ధరను హెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగులుతుంది. సాగు చేసే రైతుల్లో అధిక శాతం కౌలు రైతులే ఉన్నారు. వీరిలో కూడా ఎస్సీ, ఎస్టీలు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. సీజన్ ప్రారంభమై నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వేమూరు నియోజకవర్గంలో వేమూరు, అమర్తలూరు, కొల్లూరు మండలాల్లో అక్కడక్కడ రైతులు కోతలకు సిద్ధం అయ్యారు. బోరు వసతి కొంత మందికి ఉన్నప్పటికీ మిగిలిన ప్రాంతాల్లో బోర్లు లేక సాగు నీటిపై ఆధారపడి జొన్న, మొక్కజొన్న సాగు చేసేవారు. కానీ ఏడాది సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో అపరాలను సాగు చేసేందుకు సిద్ధపడినప్పటికీ ప్రభుత్వం ద్వారా ఎలాంటి సహాయ, సహకారాలు లేకపోవడం పట్ల రైతుల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి త్వరితగతిన రాయితీపై ఆపరాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమయానికి అందకపోతే రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఉండదని వాపోతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి వీరయ్య మాట్లాడుతూ రాయితీ అపరాలపై ప్రభుత్వానికి నివేదించామని అన్నారు. విడుదల కాగానే రైతులకు సమాచారం తెలిపి అందజేస్తామని అన్నారు.



కోతకు సిద్దంమైన వరిపైరు

## జీవపరిణామ దినోత్సవం

**ప్రజాశక్తి -పొదిలి**

భూమి మీద మానవుడు కాలక్రమంలో పరిణామం చెందాడని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె సుబ్రహ్మణ్యం అన్నారు. జీవ పరిణామ దినోత్సవం సందర్భంగా జెవివి ఆధ్వర్యంలో కస్తూరిబా బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం అమలులోకి వచ్చిన నవంబర్ 24న ప్రతి ఏడాది జీవ పరిణామ దినోత్సవంగా జరుపుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి సైన్స్ పట్ల, శాస్త్రీయ దృక్పథం పట్ల ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు. విశ్వం ఎలా ఏర్పడింది, జీవం ఎలా ఆవిర్భవించింది, మనిషి భూమిపై ఎలా ఏర్పడ్డాడు, కాలక్రమంలో ఎలా అభివృద్ధి చెందుతున్నాడో తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. మానవున్ని ఎవ్వరూ తయారు చేయలేదని చెప్పారు. జీవ పరిణామంలో జంతువునుండి మనిషి అభివృద్ధి చెందిన క్రమాన్ని వివరించారు. మనిషి మేధస్సు, ఆలోచనా శక్తి జంతువుల నుండి మనిషిని వేరు చేసిందని అన్నారు. ప్రకృతిని తనకు అనుకూలంగా మలుచుకునే శక్తి ఒక్క మానవునికి మాత్రమే ఉందని అన్నారు. ఇతర జంతువులు అన్నీ ప్రకృతిపై ఆధాపడి జీవించేవని చెప్పారు. సభకు జెవివి జిల్లా కార్యదర్శి దేవ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షులు జూపల్లి వెంకటేశ్వర్లు, కేజీబీవీ ప్రిన్సిపల్ ఎం అనురాధ, ఉపాధ్యాయులు కసుమూరు, ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.

# చట్ట విరుద్ధంగా పనిచేసే ఏ ఒక్కరినీ వదలం

**టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి**

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాస్తూ అత్యంత దుర్మార్గంగా వేల సంఖ్యలో అర్హులైన ప్రతిపక్ష సానుభూతి పరుల ఓట్లు తొలగించేందుకు అధికారులను అడ్డం పెట్టుకొని వైసిపి నేతలు చేస్తున్న కుట్రలు దేశ చరిత్రలో ఎన్నడూ చూడలేదని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్లే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. వైసిపి నేతల మాయమాటలు నమ్మి పనిచేసిన అధికారులే ఇప్పుడు బలి పశువులుగా మారుతున్నారని అన్నారు. వైసిపి నాయకుల కు సహకరించని అధికారులను అదిరిస్తూ, బెదిరిస్తూ, బతిమాలుతూ, చివరికి ఏసీబీ దాడులు చేయిస్తామంటూ మెడపై కత్తి పెట్టి ఓట్లు తొలగించేందుకు చేస్తున్న ఎత్తుగడలకు అధికారులే బలవుతున్నారని తెలిపారు. కొందరు జిల్లా అధికారులైతే ఏకంగా అధికార పార్టీకి కొమ్ముకాస్తూ వైసిపి నేతల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత నాలుగు నెలలుగా నియోజకవర్గంలో 14696 ఫారం7 అప్లికేషన్ దరఖాస్తు చేశారని తెలిపారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో నాయకులు, కార్యకర్తల ద్వారా ఓట్లను


ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

తొలగించేందుకు బల్క్‌లో దరఖాస్తు చేశారని అన్నారు. ఎన్నికల కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సంబంధం లేని ప్రక్రియలో పోలీసు అధికారులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. పోలీసులు మొక్కు బడిగా 14ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని అన్నారు. దీని వెనుకున్న కుట్ర దారులపై విచారణ చేయలేదని తెలిపారు. విచారణ పేరుతో పోలీసులు ఓటర్లను బెదిరిస్తున్నారని అన్నారు. ఎన్నడూ లేని విధంగా పోలీసులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఫారం7 దరఖాస్తులలో అధికారులు మొక్కుబడిగా చేస్తున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వేలాది మంది ఓటర్లను స్థానికత నిరూపించుకోవాలని అధికారులు వేధిస్తున్నారని పేర్కొన్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో పిలవడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ ఇచ్చిన వివరాల ప్రకారం నియోజక వర్గంలో 14696 ఫారం7 దరఖాస్తులు పెడితే అందులో 7119మాత్రమే రిజెక్ట్ చేశారని, 6140ఈ రోల్ ఇంక్లూషన్ పెట్టారని తెలిపారు. ఈ 6140ఓట్లు తొలగించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారని అన్నారు. ఈ ప్రక్రియ జరిగి నాలుగు నెలలు అవుతున్న 1437దరఖాస్తుల యాక్షన్ పెండింగ్లో ఉన్నాయని చూపించడం అధికారుల పని తీరును తెలియజేస్తుందని అన్నారు. ఫారం7 దరఖాస్తులలో పురోగతిని తెలుసుకునేందుకు ప్రతి ఓటర్ వివరాన్ని ఎలక్షన్ వెబ్సైట్లో సెర్చ్ చేయాలంటే ఇబ్బందికరమని అన్నారు. సమాచారాన్ని ఇవ్వాల్సిన అధికారులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. వైసిపికి అనుకూలంగా ఏకపక్షంగా పనిచేసే ఏ అధికారినీ వదలమని హెచ్చరించారు. అధికారులు చట్టానికి లోబడి పనిచేయాలని కోరారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

**ప్రజాశక్తి - బాపట్ల**

రాష్ట్రాన్ని కాపాడాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిందేనని టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ప్రతి ఇంటికి టిడిపిని చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం, మీ మాటే – నా బాట, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని 6వ వార్డులో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ప్రతి మహిళకు చీర పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని కోరారు. భవిష్యత్తుకు గ్యారంటీ పత్రాల్లో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. మాట తప్పను, మడమ తిప్పనని బూటకపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్న జగన్ మోహన్ రెడ్డిని గద్దె దించే వరకు పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొలపల శ్రీనివాసరావు, పరిశా రమేష్ గౌడ్, ఫరీద్ మస్తాన్, సోమల ప్రసాద్, చొక్కాకుల సాయిరాం, మందపాటి అంద్రేయ, షేక్ మస్తాన్, సురగాని తిరుపతిరావు, బొడ్డు గోవింద్, జీవన్, పల్లం సరోజినీ, నక్కల సీతాలు, రాణి, నజ్మా, ఇంద్రజ, వి పద్మ పాల్గొన్నారు.


ష్యూరిటీ పత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

**భట్టిప్రోలు :** మండల కేంద్రం భట్టిప్రోలు బు షఉటి భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటి తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబు సాధిస్తారని పేర్కొన్నారు. జగన్ పాలనలో అభివృద్ధి లేదని అన్నారు. వ్యవస్థలు నిర్వీర్యం చేశారని అన్నారు. రోడ్ల గుంతలకు కనీసం మట్టికూడా వేయలేదని అన్నారు. దీంతో ప్రయాణం నకరం, ప్రమాదకరంగా మారిందని అన్నారు. వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, లంకా ప్రసాద్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

**రేపల్లె :** మండలంలోని పెనుమూడి పంచాయతీలో శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో బాబు షఉరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను టిడిపి బూత్ కన్వీనర్ కొక్కిలిగడ్డ ధనుంజయరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధనుంజయ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. టీడీపీ అమలు చేయనున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వాటికి చంద్ర బాబు గ్యారెంటీ అని చాటాలని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అన్యాయాలు, అరాచకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించాలని కోరారు. టిడిపి మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలైన మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటి ఇంటికీ మంచి నీటి కుళాయి, పేదవారి ఆదాయాన్ని రెట్టింపు చేయడం వంటి కార్యక్రమాలను ప్రతి ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా వివరిచనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అరాచకాల వైసిపికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, ముప్పాల శ్రీనివాసరావు, నాగిడి నాగరాజు, నాగిడి ఆంజనేయులు, నాగిడి సుబ్రహ్మణ్యం, నాగిడి వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు నాగిడి చెంచులక్ష్మి పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న కార్యకర్తలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

## వివాహ వేడుకల్లో ఆనందబాబు

**ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)**

చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన మొవ్వా రామయ్య కుమారుడు టిడిపి బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు మొవ్వా శరత్ వివాహ వేడుకలు శుక్రవారం మోదుకూరు గ్రామంలో జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ మంత్రి, టిడిపి పోల్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు హాజరై వధు, వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్చార్జి వేగేసిన నరేంద్ర వర్మ, వేమురు నియోజకవర్గ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

# 'ఆడుదాం ఆంధ్ర' ఏర్పాట్లపై సమీక్ష

**ప్రజాశక్తి - రేపల్లె**

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దారు డి మల్లికార్జునరావు చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆటల నిర్వహణపై చర్చించారు. డిసెంబరు 15నుండి ఆడుదాం ఆంధ్ర ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామ, వార్డు స్థాయిలో 5రోజుల పాటు, మండల స్థాయిలో 12రోజుల పాటు, నియోజకవర్గ స్థాయిలో 5రోజుల పాటు, జిల్లా స్థాయిలో 7రోజుల పాటు, రాష్ట్ర స్థాయిలో 5రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జనవరి 26నాటికి పూర్తి చేయాలని అన్నారు. ఆడుదాం ఆంధ్రలో క్రికెట్, బాల్ బాట్మెంట్, వాలీబాల్, కబడ్డి వంటి 5 రకాల ఆటలు నిర్వహించాలని అన్నారు. క్రీడలు నిర్వహించడానికి


మాట్లాడుతున్న తహశీల్దారు మల్లికార్జునరావు

అవసరమైన గ్రౌండ్స్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. క్రీడాకారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజలను, క్రీడాకారులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. 15 సంవత్సరాలు నిండిన వాళ్ళు క్రీడల్లో పాల్గొనవచ్చని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి విజయసారథి, చైర్మన్ కట్ట మంగ, వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, విశ్వనాథగుప్త పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇమ్మానియేలు

## వినియోగదారుల హక్కులపై అవగాహన

**ప్రజాశక్తి - వేటపాలెం**

ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని జెడ్పి హైస్కూల్ హెచ్ఎం పి దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక జెడ్పి హైస్కూల్ నందు వినియోగదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి డి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో శుక్రవారం మేలుకొలుపు సదస్సు ఏర్పాటు చేశారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ అయ్యాయని అన్నారు. వాటి నుండి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినియోగదారుల దినోత్సవం 2023 సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని అన్నారు. కొనుగోలు చేసే వస్తువులు, సేవల్లో లోపాలకు తగిన నష్టపరిహారం పొందే అవకాశం ఈ చట్టం కల్పించిందని అన్నారు. విద్యార్థులు రేపటి దేశ భవిష్యత్తని, వారు ఆరోగ్యంగా ఉండాలని, జంక్ ఫుడ్‌కు, కల్తీ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు సమయంలో, వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. వస్తువులు కొనుగోలు సందర్భంలో తయారీ తేదీ, తుదిగడువు, తయారీ దారుని చిరునామా, నాణ్యత, బరువు తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులకు, బందుమిత్రులకు, స్నేహితులకు తెలియపర్చాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు పివి రమణ, వి రాధాదేవి, ఎం జానమ్మ , జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు ఎస్‌డి మతీన్, ఎస్ఎ సర్దార్ పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

**ప్రజాశక్తి - పంగులూరు**

ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష ఈనెల 26న ఆదివారం పంగులూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో జరుగుతుందని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షకు మండలంలోని ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఈపాటికే పరీక్ష కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులందరూ అర్హులేనని తెలిపారు. ఉదయం 9:30గంటల నుండి, 12:30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. సకాలంలో పరీక్షా కేంద్రానికి రావాలని కోరారు.

## నేడు మండల సమావేశం

**ప్రజాశక్తి - మేదరమెట్ల**

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 25న శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఒ డి సురేష్ బాబు శుక్రవారం తెలిపారు. పరిపాలన సంబంధమైన, ఆర్థికపరమైన మండల అభివృద్ధి గురించి చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, మండలంలోని సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - నగరం**

రేపల్లె సబ్ స్టేషన్ నుండి నిజాంపట్నం విద్యుత్ సరఫరా అయ్యే 33/11 కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తులు నిమిత్తం నేడు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నగరం, నిజాంపట్నం మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిఇ బి హరి ప్రసాదరావు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.



నిత్యావసరాలు అందజేస్తున్న పుల్లయ్య

## నిత్యావసరాలు అందజేత

**చీమకుర్తి :** బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దోమల పుల్లయ్య తన సతీమణి దోమల వసుంధర 5వ వర్ధంతి సందర్భంగా పేద మహిళలకు బియ్యం, నిత్యవసర వస్తువులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది తన వసుంధర పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం నాయకులు ఎం. మోహన్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్లు సోమ శేషాద్రి, చంద్ర, శ్రీను, చిన్న వెంకటేశ్వర్లు, జట్ల మురళి పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న దాత

## మహిళకు సూర్యశ్రీ ట్రస్ట్ చేయూత

**నాగులుప్పలపాడు :** సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మట్టిగుంట గ్రామానికి చెందిన రావూరి అశ్వినికి జీవనోపాధి నిమిత్తం దాతలు ప్రమోద్ మన్యం రూ.15వేలు, శిల్పా రాఘవేంద్ర రూ.10వేలు, నరేంద్ర చింతం రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అశ్విని భర్త సతీష్ ఏడాది క్రితం చనిపోయాడు. కుటుంబ పోషణకష్టంగా మారడంతో ఒంగోలులోని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ బాషాను ఆమె ఆశ్రయించింది. తమ కటుంబ పోషణ నిమిత్తం ఆర్థిక సాయం చేయాలని కోరింది. దీంతో ట్రస్ట్ తరుపున దాతల సహకారంతో ఇస్త్రీ పెట్టె, తోపుడు బండి, మూడు నెలలకు సరిపడ బియ్యం నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్, ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, మట్టిగుంట మూడవ వార్డు మెంబరు, సిపిఎం నాయకులు కె.సుబ్బారావు,సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**ఒంగోలు కలెక్టరేట్ :** యుటిఎఫ్ ఒంగోలు రూరల్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. రూరల్ మండల అధ్యక్షుడిగా దార్ల శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా ఆర్‌విఎస్.లక్ష్మి, సహాధ ్యక్షుడిగా కె.వీరనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎం.సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బి.సోమ సుందరావు, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శిగా యు. సుజాత, మండల కార్యదర్శులుగా ఎ..వెంకటరావు, కె.రామకృష్ణ, ఎన్. రమాదేవి, కె.శివ పార్వతి, ఏ.లక్ష్మిదేవి, జి.మమత, పి.మోహన్, జిల్లా కౌన్సిలర్లుగా బి .ఆంజనేయులు, ఆర్.నారాయణ ఎన్నికయ్యారు.

## 26న సుబ్బరామరెడ్డి జయంతి

**ఒంగోలు కలెక్టరేట్ :** ఒంగోలు మాజీ ఎంపీ స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 76వ జయంతిని ఈనెల 26న నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు రాంనగర్ 2వ లైన్‌లోని మాగుంట కార్యాలయంలో మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటానికి కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. 11 గంటలకు ఒంగోలు అభిలాష్ హోటల్ సెంటర్, 11.15 గంటలకు రైల్వే స్టేషన్ రోడ్డులో స్టేట్ బాంక్ వద్ద, 11.30 గంటలకు అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని మాగుంట సుబ్బరామరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు.ఈ కార్యక్ర మంలో మాగుంట సుబ్బ రామరెడ్డి కుమారుడు విజయబాబు పాల్గొనున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ ఆర్.శ్రీలత

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఉద్యోగులకు పని ప్రదేశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు సర్వీసుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దష్టి సారించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 'ఎంప్లాయీస్ గ్రీవెన్స్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు నెలకోసారి ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌ను నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. ఉద్యో గులు ఇచ్చిన అర్జీలను పరి శీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆమె సూ చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి చిరంజీవి, అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాలస్తీనాపై దాడులను అరికట్టాలి

### ఆవాజ్ ఒంగోలు నగర కమిటీ డిమాండ్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**




మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను అరికట్టాలని ఆవాజ్ ఒంగోలు నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ నగర్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆవాజ్ నాయకులు ఎస్‌డి. హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ పాలస్తీనాపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ భారత్ ప్రభుత్వం పూర్తి మద్దతు తెలపాలన్నారు. అమెరికా సామ్రాజ్యవాద దేశాలు దాడులను ప్రోత్సహిస్తున్నాయన్నారు. పాలస్తీనా ప్రజలకు కనీస సౌకర్యాలు నిలిపి వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలస్తీనాపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. ఐక్యరాజ్య సమితి లోనూ పాలస్తీనాకు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ జిల్లా నాయకుడు ఎమ్‌డి. యాసిన్ మాట్లాడుతూ పాలస్తీనాలో ప్రజల ఎదుటే దాడులు నిర్వహించడం దుర్మార్గమన్నారు. పిల్లలు మహిళలు భయానికి గురవుతున్నారు, చర్చిలు, మసీదులను లక్ష్యంగా చేసుకొని మహిళలు, పిల్లలపై దాడులు చేయటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తంబి శ్రీనివాసులు ఎస్‌కె. హరికృష్ణ, టి.దాసు , షేక్ జాన్ బాషా , విశ్రాంత మున్సిపల్ కమిషనర్ షేక్ నబీ సాహెబ్, ముస్లిం ప్రజాసంఘాల నాయకులు ఎస్‌కె.అబ్దుల్లా, ఎమ్‌డి. సలీం, రియాజ్, షేక్ సైదా, రెహ్మాన్ పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు : సిఐటియు

**ప్రజాశక్తి-చీమకుర్తి**

కార్మిక హక్కులు కాపాడుకోవాలంటే ఐక్య పోరాటాలతోనే సాధ్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ పేర్కొన్నారు. స్థానిక దాచూరిరామిరెడ్డి భవనంలో శ్రామిక మహిళా సమస్యలు-ప్రభుత్వ వైఖరి-పరిష్కార మార్గం అనే అంశంపై శుక్రవారం అవగాహన తరగతులు నిర్వభిహించారు. ఈ తరగతులకు యు.ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి కీలకమైన బ్యాంకులు, ఎల్ఐసి, రైల్వే, పోర్టులు,టెలికాం,బొగ్గు, రక్షణ, ఉక్కులాంటి ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ కార్పొరేట్లకు కారుచౌకగా అమ్ముతున్నారన్నారు. పోరాటాల ద్వారానే వాటిని కాపాడుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసినట్లు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డిఎంకె.రఫీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వివిధ రకాల భారాలు మోపుతుందన్నారు. సమస్యలపై కార్మికవర్గం పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, నాయకులు పూసపాటి వెంకటరావు, టి.శ్రీను, శారద, నాగరత్నం, శివరంజని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం పథకం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



:మాట్లాడుతున్న ఎం రమేష్

# కేంద్రీయ విద్యాలయంలో.. షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి చొరవతో ఒంగోలు నగరంలోని కేంద్రీయ విధ్యాలయానికి అసెంబ్లీ (సమావేశ) షెడ్ నిర్మాణానికి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ రూ.1,17,96,000 మంజూరు చేశారు. ఒంగోలు హౌసింగ్ బోర్డులోని కేంద్రీయవిద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆవరణలో పక్కా అసెంబ్లీ (సమావేశ) షెడ్ లేకపోవడంతో వేడి, తేమ వాతా వరణానికి ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారంగా విద్యాలయ ఆవరణలో ఒక అసెంబ్లీ (సమావేశ) షెడ్ ఏర్పాటు చేసేందుకు రూ.1,17,96,000 మజూరు చేయించాలని ప్రిన్సిపల్ కోరారు. దీంతో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ వసతికి నిధులు మంజూరు చేయాలని ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్‌ను 2023 మే నెలలో కోరారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కమిషనర్ రూ.1,17,96,000 మంజూరు చేశారు. ఈ నిధులతో కేంద్రీయ విద్యాలయ ఆవరణలో అసెంబ్లీ (సమావేశ) షెడ్ త్వరలో నిర్మించనున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

# పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కారానికి చర్యలు

### సిఇఒకి వివరించిన కలెక్టర్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పెండింగ్ క్లెయిమ్స్‌ను త్వరగా పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఓటర్ల జాబితా సవరణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్లెయిమ్స్ పరిష్కారంలో నాణ్యత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో మరో 32 వేల క్లెయిమ్స్‌ను పరిష్కరించాల్సి ఉందన్నారు. కలెక్టరేట్లోని ఒక్కో సెక్షన్‌కు రెండు నియోజకవర్గాలకు సంబంధించిన క్లెయిమ్స్‌ను పరిశీలించే బాధ్యతను అప్పగించామన్నారు. పిఎస్‌ఇ/ డిఎస్‌ఇ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి రిపీట్ లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, డిఆర్‌ఒ ఆర్. శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, ఇఆర్‌ఒలు, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

**బాపట్ల జిల్లా :** ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో 2024 ఓటర్ల జాబితా, ఓటర్లు జాబితాలో చేర్పులు, ఓటర్ గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర ఓటరు జాబితాలు తయారు చేయడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపుల కోసం వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల జనరేషన్‌ను పరిశీలించాలన్నారు. ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా,జాయింట్ కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.